క్లుప్తంగా

కోలాహలంగా బాలాజీ ఆలయ వార్షికోత్సవం



పవనగిరి క్షేత్రంలో కొలువైన బాలాజీ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

అడ్డతీగల: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పవనగిరి క్షేత్రంలో కొలువైన బాలాజీ స్వామి ఆలయ 15వ వార్షికోత్సవం గురువారం కోలాహలంగా జరిగింది. తొలుత స్వామిని అర్చకుడు గణేష్‌శర్మ పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ స్వామి కల్యాణం వేద మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగింది. తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు దివ్య తలంబ్రాలను అందజేశారు.

గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



సమస్యలపై చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కొయ్యూరు: గిరిజన గ్రామాల్లోని సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీపీఎం మండల నాయకుడు గెమ్మెలి సాన డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం నిమ్మలపాలెం, జోడుమామిడి, గొప్పువీధిలో పార్టీ నాయకులు పర్యటించారు. అక్కడ సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ జాజులబంద రోడ్డును పూర్తి చేయాలని కోరారు. పీఎం జన్మన్ నిధులను రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, పీవీటీజీలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గెమ్మెలి సోమయ్య, సన్యాసిరావు, అచ్చిబాబు, వై.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే పరీక్షల్లో విజయం



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దారు రామకృష్ణ

గూడెంకొత్తవీధి: పరీక్షలంటే భయం వీడి ఆత్మ విశ్వాసంతో విజయం సాధించాలని గూడెం కొత్తవీధి తహసీల్దారు రామకృష్ణ విద్యార్థులకు సూచించారు. గురువారం ఆయన పెదవలస హైస్కూల్‌ను సందర్శించి అక్కడ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు సంబంధించి ఏవిధంగా సన్నద్ధం కావాలన్న దానిపై పలు సూచనలు చేశారు. అనంతరం పెదవలస సచివాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామాల్లో పాలిథిన్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు.

డిగ్రీ కళాశాలలో ఇండియన్ హిస్టరీపై సెమినార్



సెమినార్‌లో పాల్గొన్న అధ్యాపకులను ఆహ్వానిస్తున్న విద్యార్థిని

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ కె.వసుధ ఆధ్వర్యంలో హిస్టరీ ఆఫ్ ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సెమినార్‌లో పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యాశాఖ జేడీ డాక్టర్ సీహెచ్.కృష్ణ మంగళగిరి నుంచి వర్చువల్‌గా హాజరై మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాల నుంచి డాక్టర్ బాబ్జీ ఆధ్వర్యంలో నలుగురు అధ్యాపకులు, 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సులైమాన్‌ఖాన్, మధుసూదన్‌రావు, సుదర్శన్, బి.ప్రసాద్‌రెడ్డి, రమేష్‌బాబు, జె.పద్మాకర్‌బాబు ఆన్‌లైన్ రిసోర్స్ పర్సన్‌లుగా పాల్గొన్నారు.

వీఆర్ పురంలో అగ్ని ప్రమాదం



దగ్ధమవుతున్న సంతలో పాకలు

వీఆర్‌పురం: మండల కేంద్రం వీఆర్ పురంలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సంతలోని పాకలు దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పంచాయతీ సిబ్బంది సేకరించిన చెత్తకు నిప్పు పెట్టి వదిలేయడంతో అగ్గిరవ్వలు ఎగసిపడ్డాయి. దీంతో సంతలోని పాకలు కాలి బూడిదయ్యాయి. ఈ సంఘటనతో వారపు సంతల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న పలువురు తీవ్రంగా నష్టపోయారు.



అద్దె భవనం వరండాలో కొనసాగుతున్న విద్యా బోధన



శ్లాబ్ నుంచి ఊడిన పెచ్చులు



పాడైపోయిన మరుగుదొడ్లు

- శిథిలావస్థలో తాలబుతోట పాఠశాల భవనం
- ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితి
- అద్దె భవనంలో తరగతుల నిర్వహణ
- **అవస్థలు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు**

పరాయి పంచన ప్రభుత్వ పాఠశాల.!



కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న తాలబుతోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ తాలబుతోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనం నిర్మించి 40 ఏళ్ల అవుతుండడంతో శ్లాబ్ అంతా బీటలు వారి, ఇనుప ఊచలు కనిపిస్తున్నాయి. పెచ్చులూడి పడుతున్నాయి. పునాదులు పట్టుత్వం కోల్పోయాయి. ఏ క్షణమైన కూలిపోయే ప్రమాదం ఉంది. మరుగుదొడ్లు సైతం పాడైపోయాయి. గోడలు పడిపోయాయి. భవనం దుస్థితి చూసిన తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించడం మానేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. కొంత మంది వేరొక పాఠశాలలో చేర్పించారు. గతంలో 50 మంది వరకు విద్యార్థులు ఉండేవారు. ప్రసుత్తం పాఠశాల పరిస్థితితో 15 మంది మాత్రమే ఉన్నారు.

తప్పని వరండా చదువులు.!

కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాల భవనంలోనే చదువులు కొనసాగేవి. భవన పరిస్థితితో ఉపాధ్యాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తమై గ్రామంలో అద్దె భవనంలోకి పాఠశాలను మార్చేశారు. గ్రామంలో సైతం సరైన అద్దె భవనం లేకపోడంతో వరండాలోనే విద్యార్థుల చదువులు కొనసాగుతున్నాయి. వర్షం పడితే ఉపాధ్యాయుడికి బోధన కష్టతరం అవుతుంది. నేల తడిసిపోతుండంతో విద్యార్థులు కూర్చేనేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అనేక సార్లు పాఠశాల భవన సమస్యను విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నేటికి స్పందన లేదు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి నూతన భవనం మంజూరుకు చర్యలు తీసుకోవాలని తాలబుతోట గ్రామ గిరిజనులు కోరుతున్నారు.

వర్షం పడితే తడిసిపోతోంది..



మా పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉంది. అద్దె భవనంలో వరండాలో చదువుకునేందుకు ఇబ్బందిగా ఉంది. వర్షకాలంలో నేల తడిచిపోయి కూర్చోలేకపోతున్నాం. అవస్థలు పడుతూ చదువుకుంటున్నాం. మా పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలి. భవన సమస్య తీర్చాలని అధికారులకు దండం పెడుతున్నాం.

– కిల్లో భూమిత, 5వ తరగతి, తాలబుతోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

సమస్యను కలెక్టర్, పీవోలకు వివరించాం..



తాలబుతోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన పరిస్థితి చూస్తే భయంగా ఉంది. పాఠశాల విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతూ చదువుకుంటున్నారు. నూతన భవనం మంజూరు చేయాలని కలెక్టర్, ఐటీడీఏ పీవోల దృష్టికి తీసుకెళ్లాం. పాఠశాల ఎదుట విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భవనం కోసం అందోళన సైతం చేశాం. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల నూతన భవనం కోసం నిధులు మంజూరు చేయాలి.

– వెంగడ రమేష్, సర్పంచ్, సుజనకోట పంచాయతీ

కొత్త భవనం కోసం ప్రతిపాదనలు పంపాం..



ప్రస్తుతం పాఠశాల భవన పరిస్థితి బాగో లేదు. దీంతో అక్కడ తరగతులు నిర్వహించవద్దని ఉపాధ్యాయుడికి సూచించాం. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల భవన సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. నిధులు మంజూరైన వెంటనే పాఠశాల భవన పనులు మొదలు పెడతాం. ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం.

– కోడా కృష్ణమూర్తి, ఎంఈవో, ముంచంగిపుట్టు

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జాతీయ సేవ పథం, కళాశాల రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని స్థానిక డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్, పి.చలపతి, సీఐ ఎల్.హిమగిరి, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ ఎస్.గంగరాజు, ప్రధాన కార్యదర్శి జి.గౌరీశంకర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో ముందుగా 200 మంది పేర్లు నమోదు చేసుకున్నారని, వారిలో 30 రక్తదానం చేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ దత్తత గ్రామమైన గద్యగుడలో 20 మంది పేదలకు రెడ్ క్రాస్ ప్రతినిధులు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, వై.విజయలక్ష్మీ, ఎం.అనిత కమారి, రెడ్ క్రాస్ కన్వీనర్ పి.సుందరిరాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, జిల్లా రెడ్ క్రాస్ కమిటీ సభ్యుడు టి.ప్రసాద్ నాయుడు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు బి.నాగరాజు, జిల్లా కోఆర్డినేటర్ బి.సత్యనారాయణ, డాక్టర్ కె.జె.రాఘవేంద్ర, రెండు కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలితో మూత్ర పిండాలకు రక్షణ

చింతూరు: ఆరోగ్యకరమైన జీవనశైలి అవలంబించడం ద్వారా మూత్రపిండాలకు ఎంతో రక్షణ కలుగుతుందని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా అపోలో డయాలసిస్ క్లినిక్స్ ఆధ్వర్యంలో మండలంలోని కుమ్మూరులో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి నుంచి రక్షణకు ముందస్తుగానే పరీక్షలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముచ్చిక నాగార్జున, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, అపోలో డయాలసిస్ నిర్వాహకులు సుధాకరరావు, మధుకిరణ్, అభిరాం పాల్గొన్నారు.

బయోచార్ ఎరువు తయారీపై శిక్షణ



బయోచార్ ఎరువుల తయారీ, వాడే విధానంపై రైతులకు శిక్షణ ఇస్తున్న లయ సంస్థ ప్రతినిధులు

వై.రామవరం: మండలంలోని గుమ్మరిపాలెం గ్రామంలో స్థానిక లయ సంస్థ ఆధ్వర్యంలో గురువారం బయోచార్ ఎరువు తయారీ, వినియోగంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఉపయోగాలపై అవగాహన కల్పించారు. లయ కోఆర్డినేటర్ బుల్లయ్య మాట్లాడుతూ ఏజెన్సీలో విరివిగా లభ్యమయ్యే గాలిగోపురం వంటి కలుపు మొక్కలను ఎండబెట్టి, కాల్చడం వల్ల బూడిద తయారవుతుందన్నారు. ఆ బూడిదనే బయోచార్ ఎరువు అంటారని చెప్పారు. దానిని పంటలకు ఎరువుగా వాడితే అధిక దిగుబడి వస్తుందన్నారు. ఇప్పటికే వివిధ మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ఈ ఎరువును పంటలకు వాడగా విజయవంతమైందన్నారు. రసాయనాలకు బదులు ఈ సేంద్రియ ఎరువును వాడడం వల్ల ఖర్చు ఆదాతో పాటు ఆరోగ్యానికి మంచిదన్నారు.



బండిగడ్డలో ఫిల్టర్లను అందిస్తున్న లయ సంస్థ ప్రతినిధులు

సిరామిక్ పాట్ ఫిల్టర్ల పంపిణీ

వై.రామవరం: మండలంలోని చామగడ్డ పంచాయతీ బండిగడ్డ గ్రామంలో లయ సంస్థ ఆర్థిక సహాయంతో గురువారం ఇంటింటికి ఉచితంగా సిరామిక్ పాట్ ఫిల్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కోఆర్డినేటర్ బుల్లయ్య మాట్లాడుతూ మండలంలో లోతట్టు ప్రాంతంలో కలుషిత నీరుతాగి ఎంతో మంది గిరిజనులు వ్యాధుల బారినపడి పడుతున్నారన్నారు. వీటిని అరికట్టాలనే లక్ష్యంతో లయ సంస్థ, సేవక్ సంస్థలు సంయుక్తంగా ఈ ఫిల్టర్‌లను అందజేశాయని చెప్పారు. మొదటి విడతగా 25 ఫిల్టర్లు అందజేశామన్నారు. దశల వారీగా అన్ని గ్రామాలకు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పల్లాల రమణమ్మ, లయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరకులోయటౌన్: అరకులోయలోని 11కేవీ పరిధి అరకు(అంజోడ), అరకులోయటౌన్ ఫీడర్‌లో కొత్త స్తంభాల ఏర్పాటు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అరకులోయ పట్టణంతో పాటు పానిరంగిని, ఎండపల్లివలస, రవ్వలగుడ, సరభగుడ, పద్మాపురం, అరకు సంతబయలు, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఏఈఎస్ఎం అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు.

ముత్యాలమ్మ ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం రేపు



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: చింతపల్లిలో శ్రీముత్యాలమ్మ జాతర ఏర్పాట్లపై చర్చించేందుకు శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. ముత్యాలమ్మ ఆలయంలో జరిగే ఈ సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్తక, వాణిజ్య, మోటారు, తాపీమేస్త్రీలు, తదితర సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. అదే రోజు ఉత్సవ తేదీలను, ఉత్సవ కమిటీని అందరి సమక్షంలో నిర్ణయించనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి సమావేశం ప్రారంభం కానుందని, తప్పక అందరూ హాజరు కావాలని కోరారు.

సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్ల పంపిణీ



లబ్ధిదారులకు స్ప్రేయర్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వై.రామవరం: హార్టీకల్చర్ ద్వారా సబ్సిడీపై మంజూరైన తైవాన్ పురుగుల మందుల స్ప్రేయర్లను గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 48 మంది రైతులకు అందజేశారు. కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కె.బాపన్నదొర అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి ముఖ్యఅతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు స్ప్రేయర్లను పంపిణీ చేశారు. ఒక స్ప్రేయర్ ధర రూ.17,340 కాగా, 90 శాతం సబ్సిడీ పోను లబ్ధిదారుడి వాటాగా రూ.1734 చెల్లించినట్లు ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ డి.శివకుమార్, హార్టీకల్చర్ అధికారి నడిపల్లి సూకరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బస్కీ ఆరోగ్య ఉప కేంద్రం తెరవక అవస్థలు



బస్కీ ఆరోగ్య ఉప కేంద్రం వద్ద జ్వర బాధితురాలితో మాట్లాడుతున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ, తదితరులు

అరకులోయటౌన్: బస్కీ గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రం చాలా రోజుల నుంచి తెరవకపోవడంతో పంచాయతీ పరిధిలోని రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్వరంతో గురువారం ఉదయం ఆరోగ్య ఉప కేంద్రానికి వచ్చిన రోగులకు వైద్య సేవందించేవారు లేకపోవడంతో బయటే నిరీక్షించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పంచాయతీ సర్పంచ్ పాడి రమేష్, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న ఆరోగ్య ఉప కేంద్రానికి వచ్చి పలువురు రోగులను పీహెచ్‌సీకి తరలించే ఏర్పాట్లు చేశారు. బస్కీ పరిసరాల గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రం తెరవకపోవడంతో రోగులు వ్యయ ప్రయాసాలతో మాడగడ పీహెచ్‌సీ, అరకులోయ ఏరియా ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారని రమేష్, రామన్న మండిపడ్డారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రతి రోజు ఆరోగ్య ఉప కేంద్రం తెరిచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సమర్థి రాంచందర్, పీసా కమిటీ సభ్యులు కొర్రా అప్పారావు, వంతాల రవి, పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి అవసరం



మాట్లాడుతున్న కంబాల శ్రీనివాసరావు

రంపచోడవరం: హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలో కాకవాడ గ్రామంలో గురువారం జరిగిన హిందూరు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత దేశం విశ్వ గురువన్నారు. పూర్వీకులు, పెద్దలు మనకిచ్చిన కట్టుబొట్టు, సంస్కృతి, సంప్రదాయాలను నేటికి తరం వాసులు మర్చిపోకుండా కొనసాగించాలన్నారు. మతం అంటే జీవన విధానమని, కానీ మతాన్ని దేవుడి కింద మార్చి రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మన మధ్య చిచ్చు పెట్టి విడదీయాలని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి, సర్పంచ్ కొమరం పండుదొర, విండేల సామయ్య, బచ్చల జక్కమయ్య, నారాయణరెడ్డి, కాకవాడ, తున్నూరు, వేములకొండ, రాకోట, చెలకవీధి, తిరగటిరాళ్లు, పీరుకొండ, చిలకమామిడి, ఆకూరు తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలి

రంపచోడవరం: పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి అన్నారు. మండలంలో ఇర్లపల్లి, బందపల్లి, ఎర్రంపాలెం, నల్లగొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఆమె గురువారం ఆల్ ది బెస్ట్ విషస్ చెప్పారు. ప్రశాంతతో ఎటువంటి ఆందోళనకు గురి కాకుండా పరీక్షలు రాయలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తన సొంత ఖర్చులతో పరీక్ష సామగ్రిని అందజేశారు. అనంతరం ఎంపీపీ విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు.

వంతెన పూర్తి చేయాలని ఆందోళన

దుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి రోడ్డు, గత్తర జిల్లెడ గడ్డ వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెనను పూర్తి చేయాలని కోరుతూ సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బీ పోతురాజు ఆధ్వర్యంలో గిరిజనులు గురువారం ఆందోళన చేశారు. సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గసభ పంచాయతీ కూడ గ్రామంలో పర్యటించి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గృహాల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని ఆ పార్టీ మండల నాయకుడు పి.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.సత్యనారాయణ, నాయకులు, పంచాయితీ గిరిజనులు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

పాడేరు రూరల్: గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు ఆదివాసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పీఎంఆర్‌సీ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఆదివాసీ ఉద్యోగ, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు విధిగా హాజరు కావాలని ఆదివాసీ ప్రజా సంఘాల ఐక్య వేదిక సమన్వయకర్త కూడ రాధాకృష్ణ ఓ ప్రకటనలో కోరారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

రాజవొమ్మంగి: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈవో–1 సత్యనారాయణదొర గురువారం తెలిపారు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింగంపల్లి గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, రాజవొమ్మంగి బాలుర ఆశ్రమోన్నత పాఠశాల ఉన్నాయన్నారు. మండలంలోని 10 ఉన్నత పాఠశాలలకు చెందిన 461 మంది ఈ కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారని ఎంఈవో తెలిపారు.

పరిహారం చెల్లించాకే పోలవరం పూర్తి చేయాలి



వీరాయిగూడెంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎటపాక: కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా ఒకే దశలో నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన నిర్వాసిత గ్రామాలైన ఎటపాక మండలంలోని వీరాయిగూడెం, ముర్రు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత లెక్కల ప్రకారం నిర్వాసిత గ్రామాలను ఎంపిక చేశారని, వాస్తవంగా అంతకు మించి గ్రామాలు ముంపునకు గురవుతాయన్నారు. 2022 గోదావరి వరద ముంపును ప్రామాణికంగా తీసుకుని పోలవరం ముంపు గ్రామాల జాబితా తయారు చేసి, కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా నిర్వాసితులందరికీ ఒకేసారి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్మాణ వ్యయాన్ని పెంచుకుంటూ కాంట్రాక్టర్లకు నష్టం కలుగకుండా చూసుకుంటున్నారని విమర్శించారు. నిర్వాసితులందరికీ పరిహారం, పునరావాసం కల్పించిన తరువాతే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఐవీ, మండల కార్యదర్శి కాక అర్జున్‌దొర, పులుసు బాలకృష్ణ, ఇరప అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సోమన్న కుటుంబానికి పరామర్శ



సోమన్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొరగం సోమన్న కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని కుమడ పంచాయతీ బూరుగుమెట్ట గ్రామానికి గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పార్టీ మండల నాయకులు వెళ్లి సోమన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కోసం సోమన్న చేసిన సేవలు మరువలేనివన్నారు. ఏ కష్టం వచ్చినా తనను సంప్రదించాలన్నారు. ప్రతి కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ అధినేత జగనన్న తోడుగా ఉంటారని,సోమన్న కుటుంబ పరిస్థితిని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాలుగా ఆదుకునే ప్రయత్నం చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు పద్మారావు, సర్పంచులు రమేష్, ముత్తమ్మ, గంగాధర్, నరసింగరావు, నీలకంఠం, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మీ, కమల, రాములమ్మ, పార్టీ మండల కార్యదర్శి రాంప్రసాద్, నేతలు జయదేవ్, మూర్తి, సన్యాసిరావు, మంగ్లన్న, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు వేయండి.. ఇళ్లు నిర్మించుకుంటాం..

జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు గిరిజనుల వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు రోడ్ల సమస్యను విన్నవిస్తున్న భూసిపుట్టు గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలోని కుమడ, భూసిపుట్టు పంచాయతీల్లో గురువారం ఉమ్మడి విశాఖ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పర్యటించారు. స్థానిక గిరిజనులు పలు సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ముఖ్యంగా పీఎంజేవై పథకం ద్వారా గృహాలు మంజూరు చేస్తున్నారని, ఇళ్లు నిర్మించుకోవడానికి అవసరమైన సామగ్రిని తెచ్చుకునేందుకు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. రోడ్డు లేకుండా గృహాలు ఎలా నిర్మించుకోగలమని, మొదట రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలు పాల్గొన్నారు.